

# శ్మశానం

శ్రీ పంతుల నరశింగరావు

మా తల్లి యిక్కడేకదా బూడిద అయింది! మాతాత యిక్కడేకదా తగులబడిపోయేడు! నన్ను ప్రేమించే స్నేహితుడిక్కడే కదా! అదంతా తలుచుకుంటే గుండె బద్దలయిపోతుంది. ఎందరు ప్రపంచంలో తామే సౌందర్యవంతులమని విర్రవీగిపోయి తమ కోమల దేహాన్ని యిక్కడ అర్పించేసేరు! ఎందరు కోటీశ్వరులు సూర్య రశ్మి అయినా సోకని తమ దేహాన్ని భీకరాగ్ని జ్వాలల కాహుతిచేసారు! ఎందరు మహా మేధావులు ప్రపంచానికీ వుపకారంచేసే బుర్రల్ని అగ్నిదేవుడికి కానుకగా యిచ్చేసేరు! "ఛీ" యిదంతా చేస్తున్నదెవడు? అగ్ని.

"అగ్ని?" నీకేం దయలేదూ! నిన్నెవడూ కాల్చేసేవాడు లేడనా యీపొగరు! అవును, మమ్మల్ని కాల్చేస్తున్నావు. మాచేత పూజలందుతున్నావు! నీకేనా సిగ్గులేదా! మాకంటే తెలీకపోయినా ఎంత వున్నవాడికైనా ఆఖరుకి కావలిసిందేమిటి? కర్ర, కుండ, అగ్గి యింతేనా? యింకేంకావాలా? గొప్పవాళ్ళయితే గంధపు చెక్కలు, కర్పూరపు బిళ్ళలు, ఎలాగయితేనేం ఆఖరికి మిగిలింది బూడిదేనా? తల్లి పిల్లడ్ని దత్తత యిచ్చింది. మళ్ళీ తనవొడిలోకి లాక్కున్నాది. బూడిద కోసం నాడిదల్నెందుకు చెయ్యడం సృష్టికర్త? వాడికైనా బుద్ధివుండొద్దూ? పోనీ మనకైనా బుద్ధి వుండొద్దా? ఎందుకీ మత వైరాలు?

"బాబూ రక్షించాల బాబూ"

"ఎవరది? వొస్తున్నా"

"బాబూ మాలోడ్ని బాబూ "వొక్కడే బాబూ" నాకడుపు కొట్టేసిపోయినాడు బాబూ, నాకేం దిక్కులేదు బాబూ "రక్షించాలబాబూ, మాలోడ్ని ముట్టుకోల్లొచ్చింది బాబూ"

"తాతా" మరేంభయంలేదు! యిక్కడ అందరూ సమానమే! యిదో విశాల సామ్రాజ్యం, యిక్కడ మత మనేది లేదు! యీర్ష్య క్రోధం యిలాటివేవీలేవు! అందరూ సమానమే.

"అదిగో మంట" ఎలావేస్తోందో! మత పట్టుదల వాళ్ళ మనసు కరిగించే మంట! భోగలాలసులైనవాళ్ళకి బుద్ధి తెప్పించే మంట! "అమ్మో"—అదిగో—మంట—మంట—